సాక్షి
నాగర్‌కర్నూల్
బుధవారం । 4 । అక్టోబర్ । 2023



రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం
రైతుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు.

వివరాలు 8లో ▸



బతుకమ్మ చీరల పంపిణీ
బతుకమ్మ చీరలు పంపిణీ చేయడానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
32.1 /20.9

వాతావరణం
ఆకాశం కొంత మేర మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రి సమయంలో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎస్‌ఏ-1 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు
కందనూలు: జిల్లావ్యాప్తంగా **ఒకటి నుంచి** పదో తరగతి విద్యార్థులకు **ఎస్‌ఏ-1(సమ్మెటివ్** అసెస్‌మెంట్) పరీక్షలు **ప్రారంభం కాను**న్నాయని డీఈఓ గోవిం**దరాజులు మంగళ**వారం ఒక ప్రకటనలో **తెలిపారు. జిల్లాలోని** 1,148 ప్రభుత్వ, ప్రైవేట్, **గురుకులాల పాఠశా**లల్లోని 1,07,554 మం**ది విద్యార్థులు పరీక్ష**లకు హాజరవుతారన్నా**రు. పరీక్షలు గురు**వారం ప్రారంభమై 11 **వరకు జరుగుతాయని** చెప్పారు. 1- 5వ **తరగతి విద్యార్థులకు** ఉదయం 9.30 నుంచి 12 **గంటల వరకు, 6, 7** తరగతులకు ఉదయం 10 నుంచి 12.45 గంటల వరకు, 9, 10 విద్యార్థులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, 8వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. హెచ్‌ఎంలు సంబంధిత ఎమ్మార్సీల నుంచి బుధవారం ప్రశ్నపత్రాలు తీసుకెళ్లాలని, పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు తమ పరిధిలోని పాఠశాలలను తనిఖీ చేసి, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

రేపటి నుంచి సదరం శిబిరాలకు స్లాట్ బుకింగ్
కందనూలు: జిల్లాలోని దివ్యాంగులు, ఇతరులు నూతన, రెన్యువల్ కోసం సదరం సర్టిఫికెట్లు పొందడానికి స్లాట్ బుకింగ్ గురువారం నుంచి ప్రారంభం అవుతాయని డీఆర్‌డీఓ నర్సింగ్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శారీరక దివ్యాంగులకు ఈ నెల 12, 17, 26, 31 తేదీల్లో, వినికిడి, కంటిచూపు లోపం ఉన్నవాళ్లకు 11న, మానసిక లోపం ఉన్నవారికి 9, 16 తేదీల్లో జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో సదరం క్యాంప్ ఉంటుందన్నారు. అర్హులైన దివ్యాంగులు మీ సేవలో రూ.35 రుసుం చెల్లించి స్లాట్ బుకింగ్ చేసుకోవాలని కోరారు. శిబిరానికి వచ్చే దివ్యాంగులు తమ ఆధార్, ఆస్పత్రి పేపర్లతోపాటు, మూడు పాస్ ఫొటోలు తీసుకురావాలని సూచించారు.

అసంక్రమిత వ్యాధులపై ఆందోళన వద్దు



నాగర్‌కర్నూల్ క్రైం: అసంక్రమిత వ్యాధుల పట్ల రోగులు ఆందోళన పడకూడదని.. ఎవరైనా అసంక్రమిత వ్యాధుల బారిన పడితే వైద్యులను సంప్రదించాలని డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అసంక్రమిత వ్యాధులపై వైద్యసిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీపీ, షుగర్‌తోపాటు క్యాన్సర్ వంటి అసంక్రమిత వ్యాధుల బారిన పడితే ఆందోళన పడకుండా వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని, అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. అసంక్రమిత వ్యాధుల బారినపడిన వారి వివరాలు ఎప్పటికప్పుడు వైద్య సిబ్బంది సేకరించాలని సూచించారు.

‘తెలంగాణలో నిరంకుశ పాలన’



కల్వకుర్తి టౌన్: కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో నిరంకుశ పాలన సాగుతుందని జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్ అన్నారు. మంగళవారం కల్వకుర్తిలోని జేపీనగర్ వద్ద బీఆర్‌ఎస్ వీడుతున్న నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉద్యమ సమయంలో ఏనాడు తెలంగాణ జెండా పట్టని జైపాల్‌యాదవ్‌కు నాలాంటి ఉద్యమకారులు ఎంతోమంది సహకరిస్తేనే ఎమ్మెల్యేగా గెలుపొందారని గుర్తుంచుకోవాలన్నారు. సోమవారం మండలంలోని జిల్లెలలో ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ, తనపై ఎగతాళి, హేళన చేసినట్లుగా మాట్లాడటం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. కాంగ్రెస్ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేలను బీఆర్‌ఎస్‌లో చేర్చుకున్న సమయంలో వారితో రాజీనామాలు ఎందుకు చేయించలేదని ప్రశ్నించారు. తాము వారిలాగా నీచ సంస్కృతిని పాటించమని, తప్పకుండా పదవులకు రాజీనామా చేశాకే కాంగ్రెస్‌లోకి వెళ్తామని స్పష్టం చేశారు. ఈ నెల 6న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి వెంట కాంగ్రెస్ పార్టీలో చేరతామని, ఎమ్మెల్సీ సైతం తన పదవికి రాజీనామా చేస్తారని ఆయన ప్రకటించారు.

వరద జలాలు రాకుంటే..
గడ్డుకాలమే
సెప్టెంబర్‌లోనే జలకళ తప్పిన కృష్ణానది



సోమశిల సమీపంలో కృష్ణానదిలో నీటిమట్టం ఇలా..

- శ్రీశైలం ప్రాజెక్టులో భారీగా తగ్గిన నీటినిల్వ
- రోజురోజుకూ తగ్గిపోతున్న బ్యాక్‌వాటర్
- ఎనిమిదేళ్ల తర్వాత ఇప్పుడే ఈ పరిస్థితి
- ఈ సారి యాసంగిలో సాగునీటికి తప్పని కష్టాలు

కొల్లాపూర్: వర్షాకాలంలో నిండుకుండలా ఉండాల్సిన కృష్ణానది ఈ ఏడాది కళ తప్పింది. ఎగువ ప్రాంతాల నుంచి వరద జలాలు రాకపోవడంతో నదిలో నీటిమట్టం తగ్గుముఖం పడుతోంది. ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ ఈ ఏడాది శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో నీటమట్టం తక్కువ మొత్తంలో కనిపిస్తోంది. పరిస్థితులు ఇలాగే ఉంటే యాసంగి సీజన్‌లో పంటల సాగు కష్టతరంగా మారే అవకాశాలు ఉన్నాయి.

854 అడుగుల ఎత్తులోనే..

శ్రీశైలం బ్యాక్‌వాటర్ ఫుల్ గేజ్ లెవల్ 885 అడుగులు. ఈ మేరకు నీటి నిల్వలు ఉంటే కృష్ణానది ప్రవాహం వెంట ఉండే పుష్కర ఘాట్లన్నీ నీటితో కళకళలాడుతాయి. ఆగస్టు నుంచి నవంబర్ నెలాఖరు వరకు శ్రీశైలం బ్యాక్ వాటర్ నిండుకుండలా ఉంటుంది. ఈ సమయంలోనే వరద జలాలను తెలంగాణలోని కేఎల్‌ఐ ప్రాజెక్టుతోపాటు, ఏపీలోని పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోతలు రెగ్యులర్‌గా కొనసాగుతుంటాయి. కేఎల్‌ఐ ప్రాజెక్టు ద్వారా రోజుకు 0.2 టీఎంసీ, పోతిరెడ్డిపాడు ద్వారా రోజుకు 0.5 టీఎంసీల నీటి పంపింగ్ చేస్తారు. కానీ, ఈ ఏడాది శ్రీశైలం బ్యాక్‌వాటర్ సెప్టెంబర్‌లో 854 అడుగులు దాటలేదు. ఈ మొత్తం మరో నెలలో భారీగా తగ్గే అవకాశం ఉంది. 885 అడుగుల ఎత్తులో బ్యాక్ వాటర్ నీళ్లుంటే 215 టీఎంసీలు నదిలో ఉన్నట్టు లెక్క. ప్రస్తుతం 856 అడుగుల ఎత్తులో నీళ్లుంటే బ్యాక్‌వాటర్‌లో కేవలం 94.45 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉంది. ఇక 800 అడుగుల వరకు మాత్రమే కేఎల్‌ఐ ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తిపోసుకునే అవకాశం ఉంటుంది. నాలుగురోజుల క్రితం ఎగువ నుంచి కొంత వరద రావడంతో నార్లాపూర్ వద్ద పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పంప్ నుంచి 1.5టీఎంసీల నీటిని ఎత్తిపోశారు.

తక్కువ మొత్తంలో వరద..
ఎగువ ప్రాంతాల నుంచి కృష్ణానదికి వరదలు జూలై, ఆగస్టులో వస్తుంటాయి. కానీ, ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా వరద జలాలు తక్కువగా వచ్చాయి. జూరాల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు నీటి విడుదల తక్కువ మొత్తంలో కొనసాగుతుంది. అక్కడి నుంచి విద్యుదుత్పత్తి కేంద్రాలకు నీటి సరఫరా చేయడంతోపాటు నాగార్జునసాగర్‌కు నీటిని విడుదల చేస్తారు. అయితే శ్రీశైలానికే అనుకున్న స్థాయిలో వరదలు లేకపోవడంతో నాగార్జునసాగర్‌కు విడుదల చేయలేదు.

శ్రీశైలం ప్రాజెక్టులో ఇలా..	మొత్తం నీటిమట్టం	ప్రస్తుతం ఉన్నది	పూర్తిస్థాయి నీటి నిల్వ	అందుబాటులో ఉన్నది
	885 అడుగులు	856 అడుగులు	215.807 టీఎంసీలు	94.4570 టీఎంసీలు

సాగుకు కష్టాలే..
కృష్ణానదికి వరదలు రాకుంటే యాసంగి సీజ**న్‌లో పంటల సాగు క**ష్టతరంగా మారే అవకా**శాలు కనిపిస్తున్నాయి.** ప్రస్తుతం నదిలో ఉన్న **నీటి నిల్వ లెక్కల ప్ర**కారం రోజుకు 0.2 టీఎం**సీల చొప్పున ఖరీఫ్** సాగు అవసరాలకు **కేఎల్‌ఐ ద్వారా నీటిని** విడుదల చేస్తారు. ఈ **లెక్కన ఖరీఫ్ ముగిసే** నాటికి సాగు, తాగునీటి **అవసరాలకు 6 టీఎం**సీల నీటినే వాడుకునే **అవకాశం ఉంది. రబీ** సీజన్ ప్రారంభం నాటికి **నదిలో నీటి నిల్వలు** 830 నుంచి 810 అడుగు**లకు తగ్గిపోతే కేవలం** తాగునీటి అవసరాలకు **మాత్రమే నీటిని ఎత్తి**పోసుకోవాల్సి ఉంటుం**ది. దీంతో పంటల సా**గుకు నీటి విడుదల ఉం**డకపోవచ్చని అధికారు**లు చెబుతున్నారు. గత **ఎనిమిదేళ్ల తర్వాత ఈ**సారే అలాంటి పరిస్థితి వచ్చిందని వారు అభిప్రాయపడుతున్నారు.

ఆయకట్టు రైతులకు ఇక్కట్లు
శ్రీశైలం బ్యాక్‌వాటర్‌పై ఆధారపడి కేఎల్‌ఐ, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులు నిర్మించారు. పాలమూరు ప్రాజెక్టు ఇటీవలనే ప్రారంభమైన నేపథ్యంలో దీనిద్వారా సాగునీటి అవసరాల కోసం ఎత్తిపోతలు చేపట్టేందుకు ఇంకా అనుమతులు రాలేదు. ప్రస్తుతానికి తాగునీటి అవసరాల కోసం మాత్రమే ఎత్తిపోతలకు అనుమతులు ఉన్నాయి. కేఎల్‌ఐ ప్రాజెక్టు పరిధిలో ఉన్న 3.40 లక్షల ఎకరాల ఆయకట్టు రైతులకు రబీసీజన్‌లో ఇక్కట్లు ఎదురుకానున్నాయి. బ్యాక్‌వాటర్ లెవల్స్ తగ్గితే సాగునీటికి నీటి విడుదల నిలిపివేస్తారు. కేవలం తాగునీటి మాత్రమే ఎత్తిపోతలు కొనసాగుతాయి. దీంతో రబీ సీజన్‌లో కేఎల్‌ఐ ఆయకట్టు రైతాంగానికి ఇక్కట్లు ఎదురయ్యే పరిస్థితులు నెలకొన్నాయి.

రోజురోజుకూ తగ్గుతున్నాయి..



కృష్ణానదిలో సెప్టెంబర్‌లో సోమశిల, మంచాలకట్ట, జటప్రోల్ ప్రాంతాల్లో నీళ్లు నిండుకుండలా ఉంటాయి. కానీ, ఈసారి బాగా తక్కువగా ఉన్నాయి. రోజురోజుకూ నీళ్లు తగ్గిపోతున్నాయి. ఎనిమిదేళ్ల క్రితం ఇలాంటి పరిస్థితి ఉండగా.. మళ్లీ ఇప్పుడు చూస్తున్నాం. పైనుంచి వరద రాకపోవడం వల్లే నదిలో నీళ్లు తక్కువగా ఉన్నాయి. – గోపినాయుడు, మంచాలకట్ట

ఈసారి సాగునీరు కష్టమే..



కృష్ణానదిలో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి నీటిమట్టం సెప్టెంబర్‌లోనే తగ్గిపోయింది. ఎగువ నుంచి వరదలు రాకపోవడమే ఇందుకు కారణం. ప్రస్తుతం శ్రీశైలం బ్యాక్‌వాటర్ 854 అడుగుల ఎత్తులో ఉంది. కేఎల్‌ఐ ద్వారా రోజువారీగా నీటి ఎత్తిపోతలు సాగుతున్నాయి. ఖరీఫ్ సాగుకు అవసరమైన నీళ్లను అందిస్తాం. ఈ 15 రోజుల్లో వరదలు రాకుంటే యాసంగి సీజన్‌లో సాగునీరివ్వడం కష్టమే. – శ్రీనివాసరెడ్డి, ఈఈ, నీటిపారుదలశాఖ

పదేళ్లలో కృష్ణా జలాల సమస్యే తేల్చలే



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

- ఉద్యమ పార్టీకి అధికారం ఇస్తే అభివృద్ధి శూన్యం
- రాష్ట్రంలో మంత్రులకు, ఎమ్మెల్యేలకు పవర్ లేదు
- ప్రొఫెసర్ హరగోపాల్ విమర్శ

పాలమూరు: కర్ణాటకలో కావేరి నది జలాలపై ప్రభుత్వమే పోరాటం చేస్తుంటే.. తెలంగాణలో మాత్రం కృష్ణా నీటి పంపిణీలో మనకు రావాల్సిన న్యాయపరమైన వాటా కోసం పదేళ్ల నుంచి ఎందుకు తేల్చడం లేదని ప్రొఫెసర్ హరగోపాల్ డిమాండ్ చేశారు. పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో నెలకొన్న సమస్యలతోపాటు దశాబ్ద కాలంలో గడిచినా హామీలు, హక్కులు అమలు చేయని ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ రెండోరోజు మంగళవారం టీటీడీ కల్యాణ మండపం ఎదుట 30 గంటల సత్యాగ్రహ ఉద్యమం నిర్వహించారు. సాయంత్రం దీక్ష శిబిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సీఎంకు తప్ప.. మంత్రులు, ఎమ్మెల్యేలకు ఎలాంటి అధికారం లేదన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు భూములు ఆక్రమించడం, కబ్జాలు చేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. వీళ్లు అధికారంలోకి ప్రజల సమస్యలు పరిష్కరించడానికి వచ్చారా.. లేక వాళ్ల పబ్బం గడుపుకోవడానికి వచ్చార అని ప్రశ్నించారు. రాష్ట్రంలో డీఎస్సీతోపాటు ఇతర రిక్రూట్‌మెంట్స్ లేకపోవడంతో దాదాపు 30 లక్షల మంది నిరుద్యోగులుగా మిగిలిపోయారన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత పాలమూరు గ్రామాల్లో ఏం మార్పు వచ్చిందని, రైతుల ఆత్మహత్యలతోపాటు వలసలు, ఇప్పటికీ అదే పరిస్థితి కనిపిస్తుందన్నారు. ఒక్కప్పుడు పౌర హక్కుల సంఘంలో పనిచేస్తానని చెప్పిన కేసీఆర్.. ఇప్పుడే అదే పౌర హక్కుల నేతలను అక్రమ కేసులతో వేధిస్తున్నాడని దుయ్యబట్టారు. దీక్ష శిబిరానికి అంతమ్మ అనే మహిళ వచ్చి చెబుతుంటే గ్రామీణ స్థాయిలో పరిస్థితి ఎంత దుర్భరంగా ఉందో అర్థమవుతుందన్నారు. ఆమెకు సంబంధించిన రెండెకరాల భూమిని బీఆర్‌ఎస్ నాయకులు ఆక్రమించారని, కూలీ పనులు చేస్తూ ఐదుగురు పిల్లలను పోషిస్తున్నట్లు వాపోయిందన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా ఒక్క తెలంగాణలో ఉపా చట్టం కింద 300 మందిపై కేసులు నమోదు చేశారన్నారు. గత పదేళ్లలో పాలమూరు యూనివర్సిటీ కోసం కేవలం రూ.8 కోట్ల నిధులు కేటాయించడం చూస్తుంటే జిల్లాను ఎంత అవమానపరిచారో అర్థం చేసుకోవాలన్నారు. అంతకు ముందు పాలమూరు అధ్యయ వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి మాట్లాడుతూ 2014లో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి 29 అంశాలపై, 2018లో 49 అంశాలపై, ఇప్పుడు మూడోసారి 91 అంశాలపై ప్రభుత్వానికి డిమాండ్లు అందించినా.. స్పందన లేదన్నారు. విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నాగయ్య మాట్లాడుతూ పాలమూరుకు రావాల్సిన నిధులు మొత్తం తీసుకుపోయి కాళేశ్వరం కోసం ఖర్చు చేశారని ఆరోపించారు. ఈ ప్రభుత్వం దక్షిణ తెలంగాణను పూర్తిగా ఎడారిగా మార్చిందని, అభివృద్ధి అంటే రియల్ ఎస్టేట్ కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు తిమ్మప్ప, నర్సప్ప, సతీష్‌రెడ్డి, శ్రీదేవి, ఖలీల్, బుచ్చారెడ్డి, వెంకటేశ్వర్లు, ఇక్బాల్‌పాష, అశోక్, సుదర్శన్, వనమాల పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణాలతో చరిత్ర సృష్టించాం

- ఎక్కడా లేని విధంగా ప్రతి గ్రామంలో ఏర్పాటు చేశాం
- క్రీడలతో మానసిక ప్రశాంతత, దేహదారుఢ్యం: మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- పాలమూరు రూపురేఖలు మారిపోయాయి: సీఎస్



స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, సీఎస్ శాంతికుమారి

హన్వాడ: సీఎం కేసీఆర్ నేతృత్వంలో దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రతి పల్లె, గ్రామం, వార్డుల్లో క్రీడా ప్రాంగణాలు నిర్మించి చరిత్ర సృష్టించామని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం హన్వాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, క్రీడాశాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ ఆంజనేయగౌడ్‌లతో కలిసి మంత్రి స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని హన్వాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 18వేల గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు నిర్మించి, యువతను ఉత్సాహపరిచేందుకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఒక్కో గ్రామానికి రూ.50వేల విలువ చేసే క్రీడాపరికరాలు, దుస్తులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. యువకులు దేహదారుఢ్యాన్ని పెంపొందించి, నిత్యం ఉత్సాహంగా ఉండేందుకు క్రీడలు దోహదపడుతున్నాయన్నారు.

■ ఒకప్పుడు వలసలు, కరువు కాటకాలకు నిలయమైన పాలమూరు నేడు పచ్చటి పొలాలు, దారుల వెంట పచ్చని మొక్కలు, పూలవనాలతో మొత్తం రూపురేఖలు మారిపోయాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పేర్కొన్నారు. ఇక్కడి నుంచి ప్రాతినిత్యం వహిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్ జిల్లాలోని ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో.. ఆయన ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా క్రీడా ప్రాంగణాలు నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. రాష్ట్రస్థాయిలో ప్రారంభించాల్సిన క్రీడా పరికరాల పంపిణీని హన్వాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రారంభించడంపై సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం స్పోర్ట్స్ కిట్లు అందుకున్న యువకులతో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వాలీబాల్ ఆడి ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో రాష్ట్ర క్రీడాశాఖ డైరెక్టర్ లక్ష్మీ, కలెక్టర్ రవినాయక్, ఎస్పీ నరసింహ, ఎంపీపీ బాల్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మనోధైర్యం కలిగి ఉండాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీడీ చందనా సర్పే

మన్ననూర్: ప్రతి చిన్న విషయానికి విద్యార్థులు అధైర్యపడకుండా మనోధైర్యం కలిగి ఉండాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చందనా సర్పే అన్నారు. మన్ననూర్‌లోని గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆమె మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అస్వస్థతకు గురవడానికి గల కారణాలను డీటీడీఓ కమలేశ్వర్ రెడ్డి, వసతి గృహం వార్డన్ తిరుపతమ్మను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు పాఠశాలలోని విద్యార్థులతో సమావేశమైన ఆమె ఆరోగ్య పరిస్థితులు, విద్యా విషయాలు, సౌకర్యాలతోపాటు అనారోగ్యానికి గురైన విద్యార్థుల ఆరోగ్యం గురించి వాకబ్ చేశారు. మీ అందరి అవసరాలు తీర్చి ఆరోగ్యవంతమైన జీవనంతోపాటు నాణ్యమైన విద్య అందించేందుకు అధికారులను నియమించిందని తెచెప్పారు. ఎవరూ కూడా భయపడకుండా మీ హక్కులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే పాఠశాల, వసతి గృహంలో ఎలాంటి సమస్యలు లేకుండా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీటీడీఓను ఆదేశించారు.

టెట్.. తంటా

- నిలిచిపోయిన ఎస్‌ఏ పదోన్నతుల ప్రక్రియ
- టీచర్ ఎలిజిబిలిటీ పరీక్ష తప్పనిసరి చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు
- సీనియర్లలో అలుముకున్న నిరుత్సాహం
- ఉపాధ్యాయుల బదిలీలకు మాత్రమే షెడ్యూల్ విడుదల



తాడూరు మండలం తిరుమలాపూర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

అచ్చంపేట: పదోన్నతులు వస్తాయని సంతోషపడిన ఉపాధ్యాయుల్లో గుబులు మొదలైంది. పదోన్నతి పొందాలంటే తప్పనిసరిగా టీచర్ ఎలిజబిలిటీ టెస్టు (టెట్) ఉత్తీర్ణత ఉండాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో పదోన్నతుల కోసం ఏళ్లుగా నిరీక్షిస్తున్న సీనియర్ ఉపాధ్యాయుల్లో నిరాశ అలుముకుంది. ప్రస్తుతం పదోన్నతుల ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో పదోన్నతి పొందకుండా ఉద్యోగ విరమణ చెందుతామని సీనియర్ ఉపాధ్యాయులు నిరుత్సాహంలో ఉండగా.. మరోవైపు టెట్ అర్హత సాధించిన వారిలో హర్షం వ్యక్తమవుతుంది. ప్రస్తుతం జిల్లాలో 2,100 మంది ఉపాధ్యాయులు బదిలీల కోసం దరఖాస్తు చేసుకోగా.. అందులో టెట్ ఉత్తీర్ణులైన వారు 250 మంది వరకు ఉండవచ్చని అంచనా.

లోకల్‌బాడీలో నిలిచిన ప్రక్రియ..

ప్రస్తుతం లోకల్‌బాడీ స్కూళ్లకు సంబంధించి ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ నిలిచిపోయింది. ప్రభుత్వం పదోన్నతులు పక్కనబెట్టి బదిలీలకు పచ్చజెండా ఊపింది. మల్టీజోన్-2 కింద 14 జిల్లాల్లో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో గెజిటెడ్ హెచ్‌ఎంల బదిలీలు, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు హెచ్‌ఎంలుగా పదోన్నతుల ప్రక్రియ పూర్తయ్యింది. మల్టీజోన్ కింద 140 హెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉంటే 133 పోస్టులు భర్తీ అయ్యాయి. జిల్లాలో 6 హెచ్‌ఎం పోస్టులకు గాను దోమలపెంట ప్రాజెక్టు హైస్కూల్, మన్ననూర్ ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో మాత్రం హెచ్‌ఎం పోస్టులు భర్తీ కాలేదు. లోకల్ బాడీ స్కూళ్ల ఉపాధ్యాయుల (జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు) పదోన్నతులు నిలిచిపోవడంతో 82 హెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉండనున్నాయి.

భిన్నాభిప్రాయాలు..

స్కూలు అసిస్టెంట్ పదోన్నతులకు టెట్ తప్పనిసరి అన్న విషయంపై ఉపాధ్యాయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సీనియర్ ఉపాధ్యాయులు టెట్ అవసరం లేదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. టెట్ ఉత్తీర్ణతను తప్పనిసరి చేస్తూ కేంద్రం 2010లో చట్టం చేసింది. దీని ప్రకారం జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్‌సీటీఈ) అదే ఏడాది నిబంధనలు విడుదల చేసింది. ప్రస్తుతం జరుగుతున్న ఉపాధ్యాయులు అవసరం లేదంటూ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో గత నెల 27న కోర్టు టెట్ పాసై ప్రస్తుతం ఉపాధ్యాయులుగా ఉన్నవారు తమ సీనియార్టీ జాబితాను సమర్పించాలని, ఆ ప్రకారమే పదోన్నతులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కాగా 2011లో మొదటిసారి టెట్ నిర్వహించగా 2012, 2017 సంవత్సరాల్లో నిర్వహించిన డీఎస్సీ ద్వారా సర్వీస్‌లో చేరారు. ఈ క్రమంలో పదోన్నతుల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న సమయంలో ఈ విషయం తెరపైకి తేవడం సరికాదంటున్నారు. తాము పదోన్నతి లేకుండా ఉద్యోగ విరమణ పొందాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేటి వరకు గడువు
ఉపాధ్యాయుల బదిలీల సీనియారిటీ, డీఎస్సీ, ర్యాంకులపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే మంగళ, బుధవారాల్లో మధ్యాహ్నం 2 గంటల వరకు తమ కార్యాలయంలో సమర్పించాలని డీఈఓ గోవిందురాజుల వెల్లడించారు. అలాగే స్పౌజ్ పాయింట్స్ కలుపుకోవడానికి, తొలగించడానికి బుధవారం మధ్యాహ్నం 2 గంటల వరకు దారఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఆ తర్వాత ఎలాంటి వినతులు తీసుకోమని, గురువారం బదిలీలకు సంబంధించి సీనియారిటీ జాబితా వెబ్‌సైట్‌లో పొందుపర్చుతారు. ఈ నెల 6, 7 తేదీల్లో వెబ్ ఆప్షన్స్ ఎంచుకోవడానికి, 8న ఆప్షన్స్ ఎడిట్ చేసుకునేందుకు అవకావం ఉంటుంది.

చొరవ తీసుకోవాలి..



టెట్ ఉత్తీర్ణత ఉన్నవారికి పదోన్నతి ఇవ్వాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం విచారకరం. 2010కి ముందు సర్వీసులో చేరిన ఉపాధ్యాయులకు టెట్ ఉత్తీర్ణత మినహాయించారు. ఆ నియామకం ద్వారా సర్వీసులో చేరే వారికి మాత్రమే టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి. అదే ఉద్దేశంతో సర్వీస్‌లో ఉన్నవారు ఎవరూ టెట్ రాయలేదు. ఇప్పుడు టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి అన్న విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. – సుదర్శన్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

సీనియర్లకు అన్యాయం..



2010 ఆగస్టుకు ముందు నియామకమైన వారికి టెట్ అవసరం లేదని ఎన్‌సీటీఈ ఉత్తర్వుల్లో పేర్కొంది. కొన్నేళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో రాణిస్తున్న వారికి టెట్ అవసరం లేదు. పదోన్నతుల కోసం నిరీక్షిస్తున్న వారికి తీవ్ర అన్యాయం జరుగుతుంది. ఈ విషయమై ప్రభుత్వం జోక్యం చేసుకుని.. పదోన్నతులు కల్పించిన తర్వాతే బదిలీలు ప్రక్రియ చేపట్టాలి. – శ్రీనివాస్‌రెడ్డి, జీహెచ్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు

బదిలీలు కొనసాగుతాయి..



ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదోన్నతుల ప్రక్రియ పూర్తి కాగా బదిలీల కోసం వెబ్ ఆప్షన్లు పెట్టుకునే ప్రక్రియ కొనసాగుతుంది. లోకల్ బాడీ స్కూళ్లలో హెచ్‌ఎంల పదోన్నతులు, బదిలీలు ప్రక్రియ మల్టీజోన్-2 కింద జరుగుతునందున్న రంగారెడ్డి జిల్లాలో తలెత్తిన సమస్యతో నిలిచిపోయింది. పదోన్నతులకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు. బదిలీల ప్రక్రియ చేపట్టేందుకు ఆదేశాలు రావడంతో మంగళవారం నుంచి ప్రారంభమైంది. అభ్యంతరాలు, వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. – గోవిందరాజులు, జిల్లా విద్యాధికారి

క్లుప్తంగా

టిప్పర్ ఢీకొని వృద్ధురాలి దుర్మరణం

నాగర్‌కర్నూల్ క్రైం: టిప్పర్ ఢీకొని వృద్ధురాలు దుర్మరణం చెందిన ఘటన మండలంలోని తూడుకుర్తిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ మహేందర్ వివరాల మేరకు.. తూడుకుర్తికి చెందిన చంద్రమ్మ (65) గ్రామంలో రోడ్డు దాటుతుండగా, టిప్పర్ ఢీకొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


మహేష్ (ఫైల్)

మల్దకల్: విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని తాటికుంటలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మల్దకల్‌కు చెందిన బోయ మహేష్, శేఖర్ మంగళవారం తాటికుంట సమీపంలోని రిజర్వాయర్‌లో చేపలు పట్టేందుకు వెళ్లారు. రిజర్వాయర్‌లో చేపలు పడుతున్న క్రమంలో పైనున్న విద్యుత్ తీగలను గమనించకుండా మహేష్ (25) తగలడంతో షాక్‌కు గురయ్యాడు. గమనించిన స్థానికులు విద్యుత్ సరఫరా నిలిపివేసి, అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మహేష్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య రేణుక, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య


మంగమ్మ (ఫైల్)

గోపాల్‌పేట: ఉరేసుకుని మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గోపాల్‌పేట ధన్‌సింగ్ తండాలో చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు.. ధన్‌సింగ్‌తండాకు చెందిన సంధ్యానాయక్ భార్య మంగమ్మ (45) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుంది. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె.. మంగళవారం తెల్లవారుజామున ఇంటి ముందు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. ఈ విషయంపై ఎస్ఐ వెంకటేష్వర్లును వివరణ కోరగా, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

మృతదేహం లభ్యం

అలంపూర్ రూరల్: అలంపూర్ సంతోష్‌నగర్ కాలనీకి చెందిన లక్ష్మణ్ గత నెల 28న అదృశ్యమవగా.. గొందిమల్ల సమీపంలోని తుంగభద్ర నది ఒడ్డున మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ మడుగు రమేష్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సెప్టెంబర్ 28న భర్త లక్ష్మణ్ అదృశ్యమైనట్లు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మంగళవారం లభించిన మృతదేహాన్ని పోస్ట్‌మార్టం చేసిన అనంతరం అతడి అవయవాలను ల్యాబ్‌కు టెస్ట్‌కు పంపుతున్నట్లు తెలిపారు. రిపోర్టులు వచ్చిన తరువాత లక్ష్మణ్ మరణానికి సంబంధించిన కారణాలు తెలుస్తాయని వివరించారు.

గుడిసె దగ్ధం

ధరూరు: మండలంలోని దోర్నాలకి చెందిన సాయన్నకు చెందిన నివాస గుడిసెకు సోమవారం అర్ధరాత్రి నిప్పంటుకుంది. గుర్తుతెలియని దుండగులు ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుడిసెలోని ధాన్యంతో పాటు దుస్తులు, టీవీ, ప్రభుత్వ గుర్తింపుకార్డులు కాలిపోయాయన్నారు. గ్రామానికి చెందిన ఈశ్వరన్న, ఆంజనేయులుపై అనుమానం ఉన్నట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ వెంకట్రాములు తెలియజేశారు.

రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

రూ.200 కోట్లతో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం

- 1800 మందికి ఉపాధి
- వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి
- ఎమ్మెల్యే అబ్రహంతో కలిసి కార్మాగారానికి శంకుస్థాపన


బీచుపల్లిలో పామాయిల్ ఫ్యాక్టరీ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే అబ్రహం

ఎర్రవల్లిచౌరస్తా: రైతుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఇటిక్యాల మండలం బీచుపల్లిలో ఎమ్మెల్యే అబ్రహంతో కలిసి పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ రూ.200కోట్లతో ఆయిల్‌ఫెడ్ సారథ్యంలో ఫ్యాక్టరీ పనులు చేపట్టినట్లు తెలిపారు. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 1800 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. 2003లో నష్టాల పేరుతో బీచుపల్లి ఆయిల్ మిల్లును మూసివేశారని, చంద్రబాబు హయాంలో మిల్లును అమ్మకానికి పెట్టగా.. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అడ్డుకున్నామన్నారు. కేంద్ర సంస్థ ఎన్‌డీడీబీ వద్ద ఉన్న రూ.36కోట్ల అప్పును రూ.8.40 కోట్లకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేసి ఆయిల్‌ఫెడ్ ద్వారా చెల్లించామన్నారు. ఈ ప్రాంత రైతులను అభివృద్ధి చేసేందుకు ఆయిల్‌ఫెడ్ ఫ్యాక్టరీని స్థాపించాలని సంస్థను ఒప్పించామన్నారు. మూడేళ్ల కిందట నాటిన ఆయిల్‌పాం మొక్కలకు ప్రస్తుతం గెలలు వస్తున్నాయని, మిల్లులో గంటకు 30టన్నుల సామర్థ్యంగల ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దేశ ప్రజల అవసరం మేరకు 70లక్షల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు కావాల్సి ఉందన్నారు. ప్రస్తుతం 10లక్షల ఎకరాల్లో సాగవుతుందన్నారు. దేశంలో ఏడాదికి సగటున రూ.లక్ష కోట్ల ఖర్చుతో ఇతర దేశాల నుంచి వంట నూనెలు దిగుమతి చేసుకుంటున్నామని, దేశంలో ఆయిల్‌పాం సాగు ప్రోత్సాహకానికి సబ్సిడీ ఇవ్వాలని కేంద్రాన్ని పలుమార్లు కోరినట్లు చెప్పారు. రాష్ట్రంలో 40వేల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగవుతుండేదని.. ప్రభుత్వ ప్రయత్నాల కారణంగా ప్రస్తుతం లక్షా 18వేల ఎకరాల్లో కొత్తగా సాగవుతుందన్నారు. మరో పదేళ్లలో ప్రపంచంలో ఆహార రంగానిదే అగ్రస్థానం ఉంటుందన్నారు. తెలంగాణ వ్యవసాయరంగం అభివృద్ధిని చూసి అమెరికాలోని అయోవా నగరంలో జరిగే అంతర్జాతీయ వ్యవసాయ సదస్సుకు పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్, వ్యవసాయశాఖ మంత్రి అయిన తనకు ఆహ్వానం లభించడం గర్వకారణంగా ఉందన్నారు.

మాట్లాడకుండానే వెనుదిరిగిన ఎమ్మెల్యే..

బీచుపల్లి పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి నిరంజన్‌రెడ్డి సభలో ఎమ్మెల్యే కంటే ముందుగానే మాట్లాడారు. మంత్రి మాట్లాడి వెళ్లిపోతున్న సమయంలో ఆయనతోపాటు సభలో ఉన్న జనాలు సైతం వెళ్లసాగారు. మంత్రి వెళ్లిన 5నిమిషాలకుపైగా వేదికపై ఉన్న ఎమ్మెల్యే అబ్రహం మాట్లాడతారని కొందరు ఆశించగా, ఎమ్మెల్యే మాట్లాడకుండానే వెళ్లిపోవడంతో నిరాశకు గురయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడాలని ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కోరినా ఆయన వెళ్లిపోవడం చర్చనీయాంశంగా మారింది. కార్యక్రమంలో హార్టికల్చర్ జాయింట్ డైరెక్టర్ సరోజినీదేవి, అడిషనల్ కలెక్టర్ అపూర్వచౌహాన్, రాష్ట్ర కన్స్యూమర్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, ఎండీ సురేందర్‌రెడ్డి, జీఎం చంద్రమోహన్‌రెడ్డి, మేనేజర్ సత్యనారాయణ, మార్కెటింగ్ మేనేజర్ తిరుమలేష్‌రెడ్డి, డిప్యూటీ మేనేజర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుకు ప్రోత్సాహం..

సంప్రదాయ పంటల నుంచి రైతులను మళ్లించేందుకుగాను ప్రభుత్వం ఆయిల్‌పాం సాగును ప్రోత్సహిస్తోందని ఆయిల్‌ఫెడ్ సంస్థ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. ఎకరాకు రూ.51వేల వరకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందన్నారు. నాలుగేళ్ల వరకు ఆయిల్‌పాం క్షేత్రంలో అంతర పంటలు సాగు చేసుకోవచ్చని తెలిపారు. వేసవిలో నీటి కొరత లేకుండా చూసుకుంటే చాలన్నారు. పంటలో ఎలాంటి చీడపీడలు ఉండవన్నారు. కోతులు, అడవి పందులు, రాళ్లవాన బెడద ఉండదన్నారు. రైతులతో సంబంధిత కంపెనీలు నేరుగా గెలలు కొనేందుకు ఒప్పందం చేసుకుంటాయని చెప్పారు. ఆయిల్‌పాం గెలల సేకరణ, నెలకు రెండుసార్లు ధరల నిర్ణయం కేవలం ఈ పంటకే సాధ్యమన్నారు. ఆయిల్‌పాం రైతులకు మనోధైర్యాన్ని కల్పించేందుకే ప్రభుత్వం ఫ్యాక్టరీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గద్వాల, నారాయణపేట జిల్లాల రైతులు లాభదాయకంగా ఉండే ఆయిల్‌పాం పంటను సాగు చేసుకోవాలని ఆయన సూచించారు.

పోస్టాఫీసు వద్ద ఉద్రిక్తత

- ఆధార్ అప్‌డేట్‌కు పోటెత్తిన లబ్ధిదారులు


పోస్టాఫీసు వద్ద రద్దీ

జడ్చర్ల టౌన్: బాదేపల్లి పోస్టాఫీసు వద్ద మంగళవారం ఉద్రిక్తత నెలకొంది. ఆధార్‌కార్డు అప్‌డేట్ చేసుకునేందుకు పెద్దఎత్తున లబ్ధిదారులు తరలివచ్చారు. పెద్ద సంఖ్యలో గుమిగూడటంతో సెంటర్ నిర్వాహకుడితో వాగ్వాదానికి దిగారు. చివరకు పోస్టాఫీసు అధికారులు, సిబ్బంది నచ్చజెప్పినప్పటికీ వినిపించుకోలేదు. ఈ సందర్భంగా కొంత తొక్కిసలాట జరిగింది. ఎవరికి ప్రమాదం లేకపోయినప్పటికీ తొక్కిసలాట కారణంగా పోస్టాఫీస్ కార్యాలయం కిటికీ అద్దాలు ధ్వంసమయ్యాయి. దీంతో చేసేది లేక ఆధార్‌కార్డు అప్‌డేట్ చేసుకునేందుకు వచ్చిన వారికి టోకెన్లు జారీ చేసేందుకు నిర్ణయించారు. 300 మందికి టోకెన్లు అందజేశారు. అయితే ఒక్కోరోజు కేవలం 20 నుంచి 25 కార్డులు మాత్రమే అప్‌డేట్ అవుతుండటంతో మరో పదిహేను రోజుల వరకు కొత్త టోకెన్లు జారీ చేసే అవకాశం లేదని, లబ్ధిదారులు ఎవరూ రావొద్దని పోస్టాఫీసు అధికారులు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఇతర కేంద్రాల వద్ద సైతం ఉదయం నుంచే పడిగాపులు గాస్తుండటంతో ఆధార్ అప్‌డేట్ కేంద్రాలు బ్యాంకుల్లో ఉండటంతో బ్యాంకు లావాదేవీలకు అంతరాయం కలుగుతుంది. వాస్తవానికి ఆధార్‌కార్డు అప్‌డేట్ చేసుకునేందుకు ఎలాంటి గడువు లేకపోయినప్పటికీ గడువు ముగిసిందనే ప్రచారం జరుగుతుండటంతో పెద్ద సంఖ్యలో అప్‌డేట్ చేసుకునేందుకు ముందుకు రావటంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

ప్రయాణికులకు తప్పిన ప్రమాదం


బస్సులో నుంచి బయటికి వచ్చిన ప్రయాణికులు

వనపర్తిటౌన్: ఆర్టీసీ ప్రయాణికులకు మంగళవారం పెను ప్రమాదం తప్పింది. వనపర్తి డిపో నుంచి ఉదయం 11:30 గంటలకు కర్నూల్‌కు బయల్దేరిన ఆర్టీసీ బస్సు.. ఏడు కిలోమీటర్లు ప్రయాణించాక వెనుక టైర్‌లో మంటలు రేగాయి. గమనించిన వాహనదారులు కేకలు వేయడంతో బస్సు డ్రైవర్ అప్రమత్తమై అక్కడికక్కడే నిలిపివేశాడు. బస్సు టైర్ నుంచి పొగలు రావడాన్ని చూసిన ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. విషయాన్ని కండక్టర్, డ్రైవర్ డిపో అధికారులకు తెలియజేశారు. అరగంట తర్వాత మరో బస్సు పంపించడంతో ప్రయాణికులను అందులో ఎక్కించారు. ఈ విషయమై డిపో మేనేజర్ వేణుగోపాల్‌ను సాక్షి వివరణ కోరగా, హ్యాండ్‌బ్రేక్ వినియోగంలో చిన్నపాటి పొరపాటు వల్ల లైనర్లు డ్రమ్ముకు బిగుసుకుపోయి సమస్య తలెత్తిందని తెలిపారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టామని చెప్పారు.

అధిక సాంద్రత విధానంతో లాభం


రైతులనుద్దేశించి మాట్లాడుతున్న ఏడీఆర్ మల్లారెడ్డి

బిజినేపల్లి: పత్తి సాగులో అధిక సాంద్రత విధానం పాటించడం వల్ల రైతులకు లాభం చేకూరుతోందని ఏడీఆర్ మల్లారెడ్డి అన్నారు. మండలంలోని పాలెం కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం అధిక సాంద్రత పత్తిసాగు యాజమాన్యంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో తక్కువ స్థలంలో ఎక్కువ పత్తి మొక్కలు పెంచడం వల్ల పంటకాలం తగ్గుతుందన్నారు. తెలంగాణ దక్షిణ మండలంలో తేలికపాటి వర్షాలు ఉన్నందున ఈ పద్ధతి పాటించాలని సూచించారు. రైతులు పంటమార్పిడి విధానం పాటించి, అధిక దిగుబడులు సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో కేవీకే సమన్వయకర్త ప్రభాకర్‌రెడ్డి, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త భరత్‌భూషణ్, శాస్త్రవేత్త రామకృష్ణ పాల్గొన్నారు.

వన్యప్రాణులను సంరక్షించాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బాపిరెడ్డి

మన్ననూర్: వన్యప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని వైల్డ్ లైఫ్ రిసేర్చ్ అధికారి బాపిరెడ్డి అన్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో మంగళవారం వటువర్లపల్లి ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు వన్యప్రాణి సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ జీవన విధానంపై వన్యప్రాణుల మనుగడ ప్రభావం చూపుతుందన్నారు. జీవించే హక్కు ప్రతి ప్రాణికి ఉంటుందని, వన్యప్రాణులకు హాని చేయొద్దని సూచించారు. అనంతరం పెద్దపులి, వన్యప్రాణుల జీవన విధానంపై ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌ఓ ముత్యాలు, హెచ్‌ఎం విజయభాస్కర్, శిల్పా, మమత, వాసవి, ఉపాధ్యాయులు పెద్దయ్య, లింగయ్య, లింగస్వామి, రంగయ్య పాల్గొన్నారు.

హోంవర్క్ చేయలేదని.. విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

మహమ్మదాబాద్: హోంవర్క్ చేయలేదన్న నెపంతో ఓ విద్యార్థిని ఉపాధ్యాయుడు చితకబాదిన ఘటన మహమ్మదాబాద్ మండలం నంచర్ల ఉన్నత పాఠశాలలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. దేశాయిపల్లికి చెందిన నవీన్ నంచర్ల ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. కొన్ని రోజులుగా విద్యార్థి హోంవర్క్ చేయకపోవడంతో తెలుగు ఉపాధ్యాయుడు బలరాం ఆగ్రహం వ్యక్తం చేశాడు. విద్యార్థిని బెత్తంతో చితకబాదడంతోపాటు తరగతి గది నుంచి బయటికి గెంటేశాడు. ఉపాధ్యాయుడి దెబ్బలను భరించలేని విద్యార్థి ఏడ్చుకుంటూ రోడ్డుపైకి వచ్చి, దేశాయిపల్లివైపు వెళ్లే వాహనాలను ఆపేందుకు యత్నించాడు. గమనించిన గ్రామస్తులు పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయుడిని వివరాలు అడగగా, దురుసుగా సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. ఈ విషయమై పాఠశాల హెచ్‌ఎం సురేందర్‌రెడ్డిని వివరణ కోరగా, విద్యార్థిపై దురుసుగా ప్రవర్తించినందుకు ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీస్ ఇచ్చామని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

'ఇథనాల్' కాలుష్యం నుంచి కాపాడండి


బాలుడి శరీరంపై ఏర్పడిన దద్దుర్లు

మరికల్: చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ వ్యర్థాలతో నీళ్లు కలుషితమవుతున్నాయని, కంపెనీ కాలుష్యం నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు. కంపెనీ వ్యర్థాలు చేరిన మన్నెవాగులో రెండు రోజుల కిందట గ్రామానికి చెందిన 3వ తరగతి విద్యార్థి చరణ్ స్నానం చేయగా, అతడి శరీరంపై దద్దుర్లు ఏర్పడ్డాయి. దీంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు బాలుడిని చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాలుడి పరిస్థితి మెరుగు పడుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. భయంకరమైన విష రసాయనాలతోనే మన్నెవాగు నీళ్లు కలుషితమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్యం వెదజల్లే ఇథనాల్ కంపెనీని మూసివేయాలని ఏళ్ల తరబడి ఆందోళన చేస్తున్నా తమ గోడు పట్టించుకునే నాథుడే కరువయ్యారని వాపోయారు. వాగుల్లో నీటిని పశువులు ఇతర జీవాలు తాగలేకపోతున్నాయని, రాబోయే రోజుల్లో మంచినీళ్లు దొరకని పరిస్థితి వస్తుందన్నారు. ప్రభుత్వం స్పందించి కంపెనీని మూసివేయాలని కోరారు.

అధికారుల పర్యవేక్షణలో పాఠశాల నిర్వహణ


విద్యార్థులతో మాట్లాడుతున్న డీటీడీఓ కమలేశ్వర్‌రెడ్డి

మన్ననూర్: మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల అధికారుల పర్యవేక్షణలో కొనసాగుతోంది. సోమవారం అస్వస్థతకు గురైన పలువురు విద్యార్థులు కోలుకొని ఆస్పత్రి నుంచి మంగళవారం పాఠశాలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా డీటీడీఓ కమలేశ్వర్‌రెడ్డి, డిప్యూటీ డీఈఓ శంకర్ పాఠశాలను సందర్శించి సమస్యలపై ఆరా తీశారు. గతనెల 14న అస్వస్థతకు గురైన విద్యార్థులే మరోసారి అస్వస్థతకు గురికావడానికిగల కారణాలను తెలుసుకున్నారు. మిషన్ భగీరథ నీళ్లతో విద్యార్థుల భోజనం తయారీ, తాగేందుకు ఫిల్టర్ వాటర్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. పాఠశాలలో ఏఎన్‌ఎం, పీఈటీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా అచ్చంపేట గిరిజన సేవాసంఘం, అంబేద్కర్ సంఘం నాయకులు పాఠశాలను పరిశీలించారు. వసతిగృహం, వంటగదులు, తాగునీరు, ఆహార పదార్థాలు, కూరగాయలు, పాఠశాల పరిసరాలను చూశారు. అనంతరం హాస్టల్ వార్డెన్ తిరుపతమ్మను కలిసి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బాలకిష్టయ్య, గోపాల్‌నాయక్, జైపాల్, శ్రీరాం, మోతీరాం, వంశీ, సోమ్లా, కిషన్ పాల్గొన్నారు.

పరిహారం ఇవ్వకపోతే పదవులకు రాజీనామా

- ఉదండాపూర్ ఉపసర్పంచ్, వార్డుసభ్యుల హెచ్చరిక


మాట్లాడుతున్న ఉపసర్పంచ్, వార్డు సభ్యులు

జడ్చర్ల: ఉదండాపూర్ నిర్వాసితులకు ఇస్తామన్న పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ అమలు చేయకపోతే తామంతా మూకుమ్మడిగా బీఆర్ఎస్ పార్టీ, పదవులకు రాజీనామా చేస్తామని ఉపసర్పంచ్, వార్డు సభ్యులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ అతిథిగృహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉదండాపూర్ ఉపసర్పంచ్ శేఖర్‌తోపాటు వార్డు సభ్యులు మాట్లాడారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఉదండాపూర్ ,వల్లూరు గ్రామాల వద్ద నిర్మిస్తున్న రిజర్వాయర్‌కు తాము భూములు, ఇళ్లు ఇస్తే.. ప్రభుత్వం సకాలంలో పరిహారం ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చెబుతున్న మాటలను విశ్వసిస్తూ వస్తున్నామని, అయినా తమకు సంబంధిత అధికారులు న్యాయం చేయడం లేదన్నారు. పరిహారం విషయంలో కాలయాపన చేస్తున్నారని, సర్వేల పేరుతో మభ్యపెడుతున్నారన్నారు. రేపూ మాపు అంటూ ఏళ్లు గడుస్తున్నా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయడంలేదని వాపోయారు. ఇప్పటికే తమ భూములను స్వాధీన పర్చుకుని ఐదేళ్లుగా పనులు కొనసాగిస్తున్నారని, దీంతో తాము వ్యవసాయం మానుకుని జీవనోపాధి కోల్పోయామని తెలిపారు. తమకు ఉపాధి కల్పించి ఆదుకోవాలన్న ఆలోచన చేయకపోవడం దారుణమన్నారు. తమ గ్రామస్తులను ఒప్పించి రిజర్వాయర్ నిర్మాణానికి సహకరించగా, ఇప్పటి వరకు ఇంటి స్థలాలు, సరైన ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కూడా ఇవ్వకపోవడంతో కష్టాలు అనుభవిస్తున్నామని తెలిపారు. ఈనెల 6వ తేదీలోగా తమకు న్యాయం చేయకపోతే వార్డు సభ్యత్వాలకు రాజీనామా చేస్తామని స్పష్టం చేశారు. తమతోపాటు గ్రామంలోని బీఆర్ఎస్ కార్యకర్తలు కూడా పార్టీకి రాజీనామాలు చేస్తామన్నారు. తదుపరి నిర్వాసితులమంతా ఏకమై మరో ఉద్యమానికి శ్రీకారం చుడుతామని హెచ్చరించారు. కాగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఉపసర్పంచ్ శేఖర్ తదితరులతో ఫోన్‌లో మాట్లాడి తొందర పడవద్దని, నిర్వాసితులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో వార్డు సభ్యులు రాజు, అజల్, రాములు ఉన్నారు.

చెరువులో పడి వ్యక్తి గల్లంతు

నాగర్‌కర్నూల్ క్రైం: పశువులకు నీటిని తాగించేందుకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి గల్లంతయిన సంఘటన మంగళవారం రాత్రి శ్రీపురంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీపురానికి చెందిన కుంటి వెంకటయ్య(50) తన పశువులకు నీటిని తాగించేందుకు గ్రామంలోని చెరువుకు వెళ్లగా.. ప్రమాదవశాత్తు నీటిలో పడి గల్లంతయ్యాడు. గమనించిన స్థానికులు పోలీసులకు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహం కోసం గాలించగా లభ్యం కాలేదు. చీకటి పడటంతో మృతదేహం గాలింపును నిలిపివేశారు.

విద్యుత్ బకాయిల చెల్లింపుపై తీర్పు వాయిదా

రూ.6,756.92 కోట్లు ఇవ్వాల్సిందే అంటున్న ఏపీ

- చెల్లింపుపై గతంలో ఇచ్చిన స్టేను పొడిగించాలన్న తెలంగాణ
- వెంటనే సొమ్ము చెల్లించేలా చూడాలన్న ఏపీ
- సీజే ధర్మాసనం వద్ద వాదనలు పూర్తి.. తీర్పు రిజర్వు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ, ఏపీ మధ్య నెలకొన్న విద్యుత్ బకాయిల వివాదంలో హైకోర్టులో వాదనలు పూర్తయ్యాయి. బకాయిలు వెంటనే చెల్లించేలా చూడాలంటూ ఏపీ.. దీనిపై ఇప్పటికే ఇచ్చిన స్టేను పొడిగించాలంటూ తెలంగాణ వివిధ అంశాలను ప్రస్తావిస్తూ సుదీర్ఘంగా వాదనలు వినిపించగా.. హైకోర్టు మంగళవారం తన తీర్పును రిజర్వు చేసింది.

కేంద్రం ప్రకటన నేపథ్యంలో

రాష్ట్ర విభజన తర్వాత సరఫరా చేసిన విద్యుత్‌కు సంబంధించి తమకు తెలంగాణ నుంచి రూ.6,756.92 కోట్లు (అసలు రూ.3,441.78 కోట్లు, వడ్డీ, సర్‌చార్జీలు కలిపి మరో రూ.3,315.14 కోట్లు) రావాల్సి ఉందని ఏపీ వాదిస్తోంది. దీనిని పరిగణనలోకి తీసుకున్న కేంద్రం.. ఏపీకి 30రోజుల్లోగా రూ.6,756.92 కోట్లు చెల్లించాలంటూ 2022 ఆగస్టు 29న తెలంగాణకు నోటీసులు జారీ చేసింది. ఆ నోటీసులను సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం, విద్యుత్ సంస్థలు 2022 సెప్టెంబర్‌లో తెలంగాణ హైకోర్టులో పిటిషన్లు వేశాయి. వాటిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. బకాయిల విషయంలో తెలంగాణ సర్కార్‌పై ఒత్తిడి తేవొద్దని స్టే ఇచ్చింది. ఈ వ్యవహారం ఇలా కోర్టులో ఉండగానే.. విద్యుత్ బకాయిలు తప్పకుండా చెల్లించాలని ఆదేశించినా తెలంగాణ ఇవ్వడం లేదని.. అందువల్ల రిజర్వు బ్యాంకులోని తెలంగాణ ఖాతా నుంచి సొమ్మును మినహాయించుకుని ఏపీకి చెల్లించే ప్రయత్నం చేస్తున్నట్లు కేంద్రం పార్లమెంటులో వెల్లడించింది. రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో వైఎస్సార్ సీపీ సభ్యుడు విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు ఈ సమాధానం ఇచ్చింది. దీనితో కేంద్రం ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకుండా ఆదేశించాలని, చెల్లింపులపై స్టేను పొడిగించాలని కోరుతూ తెలంగాణ హైకోర్టులోని ప్రధాన పిటిషన్‌లో మధ్యంతర అప్లికేషన్ (ఐఏ) దాఖలు చేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం సుదీర్ఘంగా విచారణ జరిపింది.

ముందు విభజన సమస్యలు తేల్చాలంటూ..

తెలంగాణ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్, రాష్ట్ర అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపించారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం కారణంగా ఉత్పన్నమయ్యే సమస్యలపై పూర్తిగా చర్చించకపోవడంతో ఈ ఇబ్బంది మొదలైందని వివరించారు. వివిధ అంశాల్లో ఏపీ కేంద్రానికి సహకరిస్తోందని.. అందువల్ల ఆ రాష్ట్రానికి అనుకూలంగా కేంద్రం నిర్ణయం తీసుకుందని ఆరోపించారు. పునర్వ్యవస్థీకరణ చట్టం నుంచి ఉత్పన్నమయ్యే సమస్యలు ఇంకా పెండింగ్‌లో ఉండగానే.. కేంద్రం కఠిన నిర్ణయాలు తీసుకోవడం సమంజసం కాదని పేర్కొన్నారు. అసలు రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం సెక్షన్ 92 ప్రకారం ఈ వివాదంలో జోక్యం చేసుకునే అధికారం కేంద్రానికి లేదని వివరించారు.

బకాయిల వల్ల ఇబ్బందుల్లో ఏపీ డిస్కమ్‌లు

తెలంగాణ బకాయిలు చెల్లించకపోవడంతో ఏపీ విద్యుత్ డిస్కమ్‌లు ఆర్థిక ఇబ్బందుల్లో పడాల్సి వచ్చిందని ఏపీ పవర్ జనరేషన్ కార్పొరేషన్ తరఫున సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి వాదనలు వినిపించారు. పునర్విభజన తర్వాత విద్యుత్ ఉత్పత్తి, సరఫరాకు సంబంధించిన ఈ బకాయిలకు, పునర్విభజన చట్టానికి ఎలాంటి సంబంధం లేదని వివరించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విభజన తర్వాత 2017 వరకు కూడా ఏపీ డిస్కమ్‌లు తెలంగాణకు విద్యుత్ సరఫరా చేశాయన్నారు. బకాయిలు చెల్లించక బొగ్గు సరఫరా నిలిచిపోయిందని, తెలంగాణకు విద్యుత్ నిలిపివేయాల్సి వచ్చిందని తెలిపారు. బకాయి ఉన్న విషయాన్ని తెలంగాణ కూడా అంగీకరిస్తోందని గుర్తు చేశారు. ఇక.. కేంద్రం తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ సూర్యకిరణ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. కేంద్రం జోక్యంతోనే తెలంగాణకు ఏపీ విద్యుత్ సరఫరా చేసిందని, బకాయిల చెల్లింపుపై ఉత్తర్వులు ఇచ్చే అధికారం కేంద్రానికి ఉందని కోర్టుకు వివరించారు. వాదనలు విన్న చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్‌ల ధర్మాసనం మంగళవారం తీర్పు రిజర్వు చేసింది.

కాంగ్రెస్, బీజేపీలను పాతర పెట్టాలి

- గజ్వేల్‌లో మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలు
- పీసీసీ అంటే పేమెంట్ కలెక్షన్ సెంటర్
- బీజేపీని నమ్ముకుంటే అధోగతే



సిద్దిపేట జిల్లా కొండపాకలో మంగళవారం ఇంటిగ్రేటెడ్ ఆఫీసు కాంప్లెక్స్‌ను ప్రారంభించిన మంత్రి హరీశ్‌రావు

గజ్వేల్: 'పీసీసీ అంటేనే పేమెంట్ కలెక్షన్ సెంటర్. బీజేపీని నమ్ముకుంటే అధోగతే. ఈ రెండు పార్టీలను పాతాళంలో పాతర పెట్టాలి. ఉచిత కరెంటు, మూడు పంటలు, ధాన్యపు రాశులు కావాలంటే కేసీఆర్ వెంటే నడవాలి..' అని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలో రూ.540 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీల తీరుపై మండిపడ్డారు. గత కాంగ్రెస్ హయాంలో ఎరువులు, విత్తనాల కోసం చెప్పులతో క్యూలు కట్టిన రోజులు రైతులు నేటికీ మరిచిపోలేదన్నారు. కరెంట్ సక్రమంగా రాక పంటలు ఎండిపోయి అన్నదాతలు అప్పుల పాలయ్యారని హరీశ్‌రావు విమర్శించారు. తప్పుదారి కాంగ్రెస్‌కు ఓటేస్తే ఉచిత కరెంట్ ఆగమైతదని రైతులు గుర్తించారని చెప్పారు. బీజేపీ వల్ల కూడా రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. కేసీఆర్ రైతే రాజు అనే సిద్ధాంతాన్ని నమ్ముకొని ముందుకు సాగటం వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని పేర్కొన్నారు. కేసీఆర్ గజ్వేల్‌తో పాటు కామారెడ్డిలో పోటీ చేస్తున్నారని, ఆయన గజ్వేల్‌లోనే ఉండాలనుకుంటే రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీ కానుకగా అందించే బాధ్యత ఇక్కడి ప్రజలపై ఉందని చెప్పారు. గజ్వేల్ నియోజకవర్గ ప్రజలకు కేసీఆర్ గృహలక్ష్మి పథకం కింద 10 వేల ఇళ్లను మంజూరు చేశారని ప్రకటించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ (టీఎస్ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ రోజాశర్మ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు పలు సంఘాల మద్దతు

గజ్వేల్ నియోజకవర్గం నుంచి ముచ్చటగా మూడోసారి పోటీ చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పలు సంఘాలు ఏకగ్రీవంగా మద్దతు ప్రకటించాయి. గజ్వేల్ ఆర్యవైశ్య సంఘం, కుమ్మరి సంఘం, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్, పద్మశాలి సంఘాలు ఈ మేరకు చేసిన తీర్మానాలను మంత్రి హరీశ్‌రావుకు అందించాయి.

కాంగ్రెస్‌ది గతం.. ఇప్పుడు ఖతం!

- వారంటీ ముగిసిన పార్టీ గ్యారంటీ ఎలా ఇస్తుంది?
- మోదీని కేసీఆర్ విమర్శించినంతగా వేరే ఎవరూ విమర్శించలేరు
- బీజేపీతో ఎలాంటి మిలాఖత్ లేదనడానికి ఇంత కంటే నిదర్శనం ఏం కావాలి
- జగిత్యాల సభలో మంత్రి కేటీఆర్



జగిత్యాల జిల్లా నూకపల్లిలో కేటీఆర్‌కు స్వీట్ అందజేస్తున్న డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుని కుమారుడు

జగిత్యాల, జగిత్యాల క్రైం, ధర్మపురి, సిరిసిల్ల, సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీది గతమని, ఇప్పుడా పార్టీ ఖతమైందని, వారంటీ ముగిసిన పార్టీ గ్యారంటీ ఎలా ఇస్తుందని ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని మినీస్టేడియంలో స్థానిక ఎమ్మెల్యే సంజయ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేటీఆర్ మాట్లాడారు. 150 ఏళ్ల కాంగ్రెస్ వారంటీ అయిపోయిందని, ఆరు గ్యారంటీలు ఇస్తే ప్రజలు నమ్ముతారా..? అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు 24 గంటల కరెంట్‌పై అనుమానం ఉందని, జగిత్యాల నియోజకవర్గానికి వచ్చి కరెంట్ తీగలు పట్టుకుంటే తెలుస్తుందని, అప్పుడు కాంగ్రెస్ పార్టీ దరిద్రం పోతుందని వ్యాఖ్యానించారు.

రేవంత్ ఆర్ఎస్ఎస్ ఏజెంట్

రేవంత్‌రెడ్డి ఆర్ఎస్ఎస్ ఏజెంట్ అని, ఆ పార్టీ నేత పంజాబ్ ముఖ్యమంత్రి అమరేందర్ సోనియాకు సైతం లేఖ రాశారని కేటీఆర్ గుర్తు చేశారు. బీజేపీ మతపిచ్చి పార్టీ అని, జనాల మధ్య చిచ్చుపెట్టి ఓట్లు దండుకోవడమే ఆ పార్టీకి తెలుసని ధ్వజమెత్తారు. పీఎం మోదీని సీఎం కేసీఆర్ విమర్శించినంతగా వేరే ఎవరూ విమర్శించలేరని, మాకు ఆ పార్టీతో, మోదీతో ఎలాంటి మిలాఖత్ లేదనడానికి ఇంత కంటే నిదర్శనం ఏం కావాలని ప్రశ్నించారు. మోదీది గాడ్సే వారసత్వమని ఆరోపించారు.

బీఆర్ఎస్ అంటే కాళేశ్వరం.. కాంగ్రెస్ అంటే శనీశ్వరం

బీఆర్ఎస్ అంటే కాళేశ్వరమని, కాంగ్రెస్ అంటే శనీశ్వరమని మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు.

జగిత్యాల జిల్లా ధర్మపురిలో మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి మాతాశిశు ఆస్పత్రితోపాటు పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో కేటీఆర్ మాట్లాడారు. నరేంద్రమోదీ అంటే నమ్మించి మోసం చేసేవాడని విమర్శించారు. కాగా జగిత్యాల జిల్లాకేంద్రంలో నిర్మించిన జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయాన్ని మంత్రులు కేటీఆర్, కొప్పుల ఈశ్వర్‌తో కలిసి హోం మంత్రి మహమూద్‌అలీ ప్రారంభించారు.

ఒక్క రూపాయి లంచం లేకుండా..

రాజన్న సిరిసిల్ల కలెక్టరేట్‌లో మంత్రి కేటీఆర్ 577 మందికి డబుల్ బెడ్రూం ఇళ్లు, 1,747 మందికి గృహలక్ష్మి పథకం మంజూరు పత్రాలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక్క రూపాయి లంచం లేకుండా నేరుగా ప్రజలకు లబ్ధి కలిగే విధంగా కేసీఆర్ పాలన వర్ధిల్లుతోందన్నారు.

మోదీ అబద్ధాల జాతర

ఎక్స్(ట్విట్టర్)లో మంత్రి కేటీఆర్ ధ్వజం

పీఎం నరేంద్ర మోదీ పదేళ్ల పాలనలో నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజలనే కాకుండా 140 కోట్ల మంది భారతీయులను మోసం చేశారని మంత్రి కేటీ రామారావు సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్ (ట్విట్టర్)లో ధ్వజమెత్తారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం, పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా వంటి విభజన హామీలకు దిక్కులేకుండా పోయిందని ఆరోపించారు. మూడు రోజుల వ్యవధిలో రెండోసారి రాష్ట్రానికి వస్తున్న మోదీ విభజన హామీలకు పదేళ్లుగా పాతరేసి అబద్ధాల జాతర చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ వంద స్థానాల్లో డిపాజిట్లు గల్లంతు కావడం ఖాయమని కేటీఆర్ స్పష్టం చేశారు.

ఆర్టీసీ చైర్మన్ గోవర్ధన్‌కు వీడ్కోలు

- ముగిసిన పదవీకాలం
- పొడిగింపులేక తప్పుకున్న బాజిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ చైర్మన్‌గా పదవీకాలం ముగియటంతో ఆ పదవి నుంచి ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తప్పుకున్నారు. మరికొద్ది నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల వరకు బాజిరెడ్డి ఆ పదవిలో కొనసాగుతారని ఆర్టీసీ వర్గాలు భావించాయి. కానీ, పదవీకాలం ముగిసినా ప్రభుత్వం నుంచి పొడగింపు ఆదేశాలు వెలువడలేదు. ఇటీవల బీఆర్ఎస్ ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపులో ఆశాభంగం కలిగిన సిట్టింగ్‌లను బుజ్జగించేందుకు ఆర్టీసీ చైర్మన్ పదవి లాంటి వాటిని వారికి అప్పగించవచ్చని, అందుకే బాజిరెడ్డికి కొనసాగింపు అవకాశం ఇవ్వలేదన్న ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఇక్కడి బస్‌భవన్‌లో ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆధ్వర్యంలో బాజిరెడ్డికి వీడ్కోలు సమావేశం జరిగింది. బాజిరెడ్డి దంపతులను ఆర్టీసీ ఉన్నతాధికారులు ఘనంగా సన్మానించారు. రెండేళ్ల పదవీకాలంలో, ఆర్టీసీ అభ్యున్నతికి బాజిరెడ్డి ఎంతో కృషి చేశారంటూ అధికారులు కితాబిచ్చారు. ''రెండేళ్లపాటు ఆర్టీసీ చైర్మన్‌గా పనిచేయటం, క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న ఆర్టీసీని బాగు చేసేందుకు ఎండీ సజ్జనార్‌తో కలిసి కృషి చేయడం జీవితంలో మరవలేను. నేను చైర్మన్‌గా ఉన్న సమయంలోనే, ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయటం నాకు ఎంతో సంతోషం కలిగించింది'' అని బాజిరెడ్డి పేర్కొన్నారు.

6న ముఖ్యమంత్రి అల్పాహార పథకం ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 6 నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ముఖ్యమంత్రి అల్పాహార పథకం ప్రారంభించాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. బతుకమ్మ పండుగను పురస్కరించుకొని రాష్ట్రంలోని మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ, యువతలో క్రీడానైపుణ్యాన్ని పెంపొందించేందుకు క్రీడా పరికరాల కిట్లను అందచేసే కార్యక్రమాలను ముమ్మరంగా కొనసాగించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు సీఎస్ శాంతి కుమారి కలెక్టర్లతో మంగళవారం రాత్రి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని సీఎం కేసీఆర్ రంగారెడ్డి జిల్లాలో లాంఛనంగా ప్రారంభిస్తారని, ఈ నెల 14 నాటికి బతుకమ్మ చీరెల పంపిణీని పూర్తి చేయాలని చెప్పారు.

మహబూబ్‌నగర్-కర్నూలు రైల్వేలైన్ విద్యుద్దీకరణ

- ఇప్పటికే సికింద్రాబాద్-మహబూబ్‌నగర్ మధ్య పూర్తి



స్టేషన్ మహబూబ్‌నగర్: ఉమ్మడి జిల్లాలోని రైల్వే ప్రయాణికులకు మరిన్ని వసతులు అందుబాటులోకి వస్తున్నాయి. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా రైల్వేస్టేషన్ల ఆధునీకరణ పనులు చురుకుగా సాగుతున్నాయి. ఇప్పటికే సికింద్రాబాద్-మహబూబ్‌నగర్ వరకు డబ్లింగ్ లైన్‌తోపాటు విద్యుద్దీకరణ పూర్తయి అందుబాటులోకి వచ్చాయి. ధర్మాబాద్-మనోహరాబాద్, మహబూబ్‌నగర్-కర్నూల్ సిటీ మధ్య 348 కి.మీ.మేర రైల్వేట్రాక్‌ను దాదాపు రూ.305కోట్ల వ్యయంతో విద్యుద్దీకరణ చేపట్టారు. మన్మాడ్-ముద్ఖేడ్, మహబూబ్‌నగర్-డోన్‌తోపాటు మహబూబ్‌నగర్-కర్నూల్ సిటీ విద్యుద్దీకరణను మంగళవారం నిజామాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ జాతికి అంకితం చేశారు.

నిరాటంకంగా నడవనున్న రైళ్లు..

విద్యుద్దీకరణ వల్ల రైలు ఇంజిన్ మార్పునవసరం లేకుండా నిరాటంకంగా నడవనున్నాయి. మార్గమధ్యంలో ప్యాసింజర్, గూడ్స్ రైళ్ల నిలుపుదల సమయం తగ్గడంతోపాటు రైళ్ల సగటు వేగాన్ని మెరుగుపరుస్తుంది. సెక్షనల్ కెపాసిటీ పెంపుదల కారణంగా ఈ విభాగాల్లో మరిన్ని రైళ్లను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. దీనివల్ల రైళ్లు పర్యావరణ అనుకూలమైన విద్యుత్ వినియోగంతోపాటు ఇంధన ఖర్చులను కూడా ఆదా చేస్తుంది.

96 యూనిట్ల రక్తం సేకరణ

పాలమూరు: మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నెలకొన్న రక్త నిల్వల కొరత కారణంగా గాంధీ జయంతి సందర్భంగా పెద్దపల్లి సబ్ డివిజన్ పరిధిలో పోలీసులు నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో 96 యూనిట్ల రక్తం సేకరించినట్లు బ్లడ్‌బ్యాంకు సమన్వయకర్త మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో రక్త నిల్వల కొరతపై అక్కడి పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి దృష్టికి తీసుకువెళ్లగా ఆమె తక్షణమే స్పందించి స్టాల్ ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం ఇచ్చారన్నారు. రక్తదాన శిబిరంలో మొత్తం 6,166 మంది రక్తదానం చేసి అంతర్జాతీయ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తింపు పొందినట్లు వివరించారు.

4 నుంచి బతుకమ్మ చీరల పంపిణీ

- మహిళా సంఘాల ఆధ్వర్యంలో అందజేత
- ఇప్పటికే 2,25,000 చీరల సరఫరా

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఆడబిడ్డల సంబరం ప్రారంభం కానుంది. ప్రభుత్వం ప్రతి ఏడాది మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నెల 4వ తేదీ నుంచి బతుకమ్మ చీరలను పంపిణీ చేయనున్నారు. ఇప్పటి వరకు జిల్లాకు 2,25,000 చీరలు వచ్చాయి. బతుకమ్మ పండుగ 15వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఇంటింటికీ పంపిణీ చేయనున్నారు. జిల్లాకు చేరిన చీరలను జిల్లా కేంద్రంలోని జిల్లా మహిళా సమాఖ్య భవనంలో భద్రపరిచారు. రాష్ట్ర ఆడపడుచులకు చిన్న, పెద్ద శుభకార్యమనే తేడా లేకుండా చీర పెట్టడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సంప్రదాయానికి అనుగుణంగా బతుకమ్మ సందర్భంగా ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డులు కలిగి ఉన్న కుంటుంబాల్లో మహిళలకు చీరలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొమ్మిది రోజుల పూల పండుగే మహిళలకు అత్యంత ఇష్టమైన పండుగ కూడా, తీరొక్క పూలతో బతుకమ్మను కొలుస్తుంటారు. బంగారు, వెండి జరి అంచు చీరలు, చెక్స్ డిజైన్లు ఈ సారి ప్రత్యేకంగా గతంలో తయారు చేయించిన రకాలకు అదనంగా మరికొన్ని రూపొందించారు.



2,65,000 చీరల లక్ష్యం

మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ సారి 2,65,000 చీరలను పంపిణీ చేయనున్నారు. ఇందులో తొలి విడతగా 25వేలు మాత్రమే వచ్చాయి. మిగిలిన చీరలు ఈనెల చివరి వరకు రావచ్చని తెలుస్తుంది. ఏపీడీ శారద, ఐబీ డీపీఎం నాగమల్లిక పర్యవేక్షణలో చీరలను కార్యక్రమం జరుగనుంది.

జిల్లాల వారీగా వచ్చిన బతుమ్మ చీరల వివరాలు

జిల్లా	రావాల్సినవి	వచ్చినవి
మహబూబ్‌నగర్	2,68,000	2,25,000
గద్వాల	1,50,000	1,20,000
వనపర్తి	1,83,000	1,52,000
నారాయణపేట	1,76,000	1,44,000
నాగర్‌కర్నూల్	1,50,000	1,20,000

పంపిణీకి అన్ని ఏర్పాట్లు



జిల్లాలో 2.65లక్షల చీరలను పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటి ద్వారా జిల్లాకు 2.25 లక్షల చీరలు వచ్చాయి. ఈ చీరలను ఈనెల 4వ తేదీ నుంచి పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాటు చేశాం. ఇప్పటికే చీరలను జిల్లాలోని అన్ని మండలాలకు పంపించాం. మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజాప్రతినిధులు పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నారు.

– యాదయ్య, డీఆర్‌డీఓ

దాచుకుందామంటే.. దోచుకున్నారు

- రైతు ఖాతా నుంచి రూ.14.30 లక్షలు ఇతరులకు మళ్లింపు
- అచ్చంపేట ఎస్‌బీఐలో వెలుగుచూసిన క్యాషియర్ బాగోతం



బ్యాంకు అధికారితో వాగ్వాదం చేస్తున్న ఖాతాదారులు

అచ్చంపేట రూరల్: కష్టపడి సంపాదించిన డబ్బులను ఇళ్లలో దాచుకుందామంటే దొంగల భయం.. డబ్బులను బ్యాంకులో దాచుకుందామంటే బ్యాంకు అధికారులే దొంగలుగా మారిన సంఘటన అచ్చంపేటలోని ఓ బ్యాంక్‌లో చోటు చేసుకుంది. బ్యాంకు క్యాషియర్ ఓ రైతు ఖాతా నుంచి సుమారు రూ.14.31 లక్షలు ఇతరుల ఖాతాలకు మళ్లించాడు. వివరాల్లోకి వెళ్తే.. ఉప్పునుంతల మండలం తాడూరుకు చెందిన పిల్లిగుండ్ల ఆంజనేయులు, విజయమ్మకు ఇద్దరు కుమారులు. తమకు ఉన్న వ్యవసాయ పొలాన్ని అమ్మగా వచ్చిన డబ్బులను ఇద్దరు కుమారులకు పంచిపెట్టారు. అందులో ఒక కుమారుడు పిల్లిగుండ్ల వినోద్‌కుమార్‌కు రూ.15 లక్షలు ఇవ్వగా.. ఆయన అచ్చంపేటలో ఎస్‌బీఐలో తన ఖాతాలో డబ్బులు దాచుకున్నాడు. అయితే ఇటీవల తండ్రి ఆంజనేయులు అనారోగ్య సమస్యల వల్ల ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవడానికి గత నెల 29న బ్యాంకులో డబ్బులు తీసుకుందామని వచ్చాడు. తన ఖాతా నుంచి రూ.లక్ష కావాలని క్యాషియర్‌ను కోరగా.. కేవలం రూ.51,258లు మాత్రమే ఉన్నాయని చెప్పారు. దీంతో వినోద్‌కుమార్ నిలదీయగా.. బ్యాంకు మేనేజర్, ఇతర అధికారులు అమాయకంగా ఉంటే ఎలాగని ఖాతాదారుడినే దబాయించారని కుటుంబ సభ్యులు ఆరోపించారు.

బ్యాంకు ఎదుట ఆందోళన..

బ్యాంకు అధికారుల చేతిలో మోసపోయానని కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో కలిసి అచ్చంపేటలో బ్యాంక్ ఎదుట ఖాతాదారుడు మంగళవారం ఆందోళన చేపట్టి బ్యాంకు అధికారులతో వాగ్వాదానికి దిగారు. బ్యాంకులో మేనేజర్ లేకపోవడంతో డిప్యూటీ మేనేజర్ చంద్రశేఖర్‌కు సమస్యను వివరించారు. కాగా క్యాషియర్‌ను ఆర్‌బీఐ అధికారులు విచారణ చేపడుతున్నారని, డబ్బులు ఎక్కడికి వెళ్లవని, రికవరీ చేస్తామని ఫోన్‌లో ఓ బ్యాంకు అధికారితో అక్కడి ఖాతాదారులు మాట్లాడారు. ఇంత తతంగం జరుగుతున్నా బ్యాంకు అధికారులు పట్టించుకోకపోవడం తమకు అనుమానంగా ఉందని చాలామంది ఖాతాదారులు బ్యాంకు చుట్టూ తిరుగుతున్నారు.

ఇతరుల ఖాతాల్లోకి మళ్లింపు..

బ్యాంకు క్యాషియర్ కిరణ్ తమ డబ్బులను ఇతరుల ఖాతాల్లోకి మళ్లించాడని రైతు వినోద్ కుమార్, కుటుంబ సభ్యులు ఆరోపించారు. వినోద్‌కుమార్ ఖాతా నుంచి సెప్టెంబర్ 4న రూ.30 వేలు, 5న రూ.6 లక్షలు, అదే రోజున మరోసారి రూ.5 లక్షలు, 6న రూ.3 లక్షల చొప్పున మొత్తం రూ.14.30 లక్షలు ఇతరుల ఖాతాకు మళ్లించారు. సెప్టెంబర్ 29న బ్యాంకుకు వచ్చిన ఖాతాదారుడికి ఖాతాలో రూ.51,258లు మాత్రమే ఉన్నాయని చెప్పారు. అలాగే మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ భర్త చనిపోగా రైతుబంధు కింద వచ్చిన రూ.5 లక్షలు బ్యాంకులో జమ చేస్తే నెలనెలా డబ్బులు వచ్చేలా చేస్తానని చెప్పిన క్యాషియర్ కిరణ్.. రూ.4 లక్షలు డబ్బులు జమ చేసుకుని నకిలీ పత్రాలు ఇచ్చారని వాపోయింది.

జూరాలకు స్వల్ప వరద



జూరాల ప్రాజెక్టులో ప్రస్తుతమున్న నీటిమట్టం

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు స్వల్ప వరద వస్తోంది. మంగళవారం రాత్రి 7గంటల వరకు 18వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. విద్యుత్పత్తి నిమిత్తం 21,751, ఆవిరి రూపంలో 95, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, భీమా లిఫ్టు-1కు 650, ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 731, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 150, సమాంతర కాల్వకు 900, భీమా లిఫ్టు-2కు 750 క్యూసెక్కులతో కలిపి మొత్తం 25,907 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 9.439 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు.

ఆరు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి కొనసాగుతోంది. మంగళవారం 6 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ రామసుబ్బారెడ్డి తెలిపారు. ఎగువ కేంద్రంలో 3 యూనిట్లలో 117 మెగావాట్లు, 98.763 ఎంయూ, దిగువ కేంద్రంలో 3 యూనిట్ల ద్వారా 120 మెగావాట్లు, 107.270 ఎంయూ విద్యుదుత్పత్తి చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఎగువ, దిగువ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఇప్పటి వరకు 206.033 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి సాధించామని, ఇందుకు 21,751 క్యూసెక్కుల నీటిని వినియోగించినట్లు తెలిపారు.

శ్రీశైలంలో 856.0 అడుగుల నీటిమట్టం..

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో మంగళవారం 856.0 అడుగుల వద్ద 94.4570 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 21,751, సుంకేసుల నుంచి 2,264తో కలిపి మొత్తం 24,015 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుతోంది. 24గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 1,083, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,688, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకి 1,200 క్యూసెక్కుల నీటిని వదిలారు. జలాశయంలో 126 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

సుంకేసులకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసుల డ్యాంకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎగువ ప్రాజెక్టుల నుంచి 3,950 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. ఒక గేటును తెరిచి 2,264 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. కేసీ కెనాల్‌కు 1,616 క్యూసెక్కులను వదిలినట్లు జేఈ రాజు తెలిపారు.

రామన్‌పాదులో 1,020 అడుగులు..

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో 1,020 అడుగులకు నీటిమట్టం చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,030, సమాంతర కాల్వతో 750 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా వ్యవసాయ అవసరాల కోసం 900, కుడి కాల్వకు 10, ఎడమ కాల్వకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. భీమా ఫేజ్-2కు 850 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ రనిల్‌రెడ్డి తెలిపారు.

చెంచు గూడేలను రెవెన్యూ గ్రామాలుగా గుర్తించండి

- 4 వారాల్లో ఈ ప్రక్రియంతా పూర్తి చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: గిరిజన (చెంచు) గూడేలను రెవెన్యూ గ్రామాలుగా గుర్తించే ప్రక్రియ వెంటనే చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల్, నారయణపేట్, వనపర్తి జిల్లాల కలెక్టర్లు ఈ మేరకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి 4 వారాలు సమయం ఇస్తున్నామని, ఆలోగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. మహబూబ్‌నగర్ జిల్లాలోని చెంచు గూడెలను గ్రామాలుగా గుర్తించడంలో అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఈ కారణంగా వారు కొన్ని వసతులు కోల్పోతున్నారని పేర్కొంటూ శక్తి స్వచ్ఛంద సంస్థ 2005లో హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేసింది. దీనిపై వాదనలు విన్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం.. మంగళవారం తీర్పు వెలువరించింది. 'పిటిషన్ విచారణలో ఉండగానే.. షెడ్యూల్డ్ తెగలు, ఇతర సంప్రదాయ అటవీ నివాసితుల (అటవీ హక్కుల గుర్తింపు) చట్టం 2006ను పార్లమెంట్ రూపొందించింది. దీనిని అటవీ హక్కుల చట్టం అని కూడా పిలుస్తారు. 2007, డిసెంబర్ 13 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. అప్పటి నుంచి నిబంధనలు పాటించాల్సి ఉంది. ఈ చట్టం.. అటవీ నివాసులకు అక్కడి వనరులను వినియోగించుకోవడానికి, రక్షించడానికి, నిర్వహణకు కొన్ని ప్రత్యేక హక్కులను కల్పించింది. అలాగే నివాసం, సాగు భూమిపై హక్కులు అందించింది.' పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనల సందర్భంగా ఈ వివరాలను ధర్మాసనం దృష్టికి తెచ్చారు. అలాగే జిల్లాలోని అదివాసీలకు, గిరిజనులకు సాగు భూమి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పోడు పట్టాలను జారీ చేసినప్పటికీ, అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అటవీ హక్కుల చట్టం, 2006లోని సెక్షన్ 3(1)(హెచ్) ప్రకారం.. అన్ని అటవీ గ్రామాలు, ఆవాసాలను రెవెన్యూ గ్రామాలుగా మార్చడానికి అనుమతిచ్చిందన్నారు. అయినా జిల్లా కలెక్టర్లు ఈ మేరకు చర్యలు తీసుకోవడం లేదని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఇప్పటి వరకు అటవీ హక్కుల నిబంధనలను ఎందుకు అమలు చేయలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. నాలుగు వారాల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశిస్తూ, పిటిషన్‌లో వాదనలను ముగించింది.